ఈనాడు
రాజన్న సిరిసిల్ల
శనివారం అక్టోబరు 19, 2024

నిధుల్లేక నిలిచిన పనులు

ప్రతిపాదనలు ఘనం.. అమలు అధ్వానం

వివరాలు	సిరిసిల్ల	వేములవాడ
	(నిధులు రూ.కోట్లలో)	
బడ్జెట్ నిధులు	84	34.36
ఖర్చు చేసినవి	10	8
పూర్తయిన పనులకు చెల్లించాల్సినవి	4.60	3.46
నిలిచిపోయిన పనుల విలువ	43.01	17.27

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు చేపట్టడం లేదు. 2023-24 బడ్జెట్‌లో రెండు పురపాలికల్లో కలిపి వివిధ విభాగాల్లో అభివృద్ధికి రూ. 118.36 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటి మంజూరుకు ప్రభుత్వానికి కూడా పంపారు. వాటిలో రూ.18 కోట్లు మాత్రమే ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. అంటే నిర్ణయించిన బడ్జెట్‌లో 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. రెండు పురపాలికల్లో తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పన్నుల రూపంలో వస్తున్న రూ. 4 కోట్ల ఆదాయంలో ఉద్యోగుల జీతాలు, పారిశుద్ధ్యం నిర్వహణ, ఇతరత్రా ఖర్చులే నెలకు రూ.కోటిపైనే ఉంటున్నాయి. వీటిలోనూ చాలా వరకు గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లులు ఉన్నాయి.


వేములవాడలో నిలిచిన సమీకృత మార్కెట్

ముందుకు రాని గుత్తేదారులు

2023-24 పురపాలక బడ్జెట్‌లో రూ.47.70 కోట్లతో వార్డుల వారీగా మురుగుకాల్వలు, సీసీ రహదారులు, కేంద్రీయ విద్యుద్దీకరణ, కూడళ్ల విస్తరణకు టీయూఎఫ్ఐడీసీ కింద ప్రతిపాదనలు చేశారు. వీటిలో సీసీ రహదారులు, మురుగు కాల్వల పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి.

- రూ.3 కోట్లతో కలెక్టరేట్-రగుడు కూడలి విస్తరణ పనులు దక్కించుకున్న గుత్తేదారు పైపైన పనులు చేసి వదిలేశాడు. ఏడాదిగా ఆ పనులు ముందుకు సాగడం లేదు. చంద్రంపేట, శాంతినగర్, నర్సింగ్‌కాలేజీ, సంజీవయ్య కూడళ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల పనులు దక్కించుకున్న గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రూ.2 కోట్లతో కళాశాల ఆవరణలో క్రీడా మైదానం పనులు ప్రారంభించి వదిలేశారు.
- సిరిసిల్ల- వెంకటాపూర్ బాహ్యవలయ రహదారిలో రూ.4.60 కోట్లతో కేంద్రీయ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పురపాలికకు అప్పగించలేదు. గత ప్రభుత్వ హయాంలో పురపాలికలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల చేయలేదు. దీంతో పురపాలికలో అన్ని విభాగాల్లో పనులు చేసిన గుత్తేదారులకు పెద్ద ఎత్తున బకాయిలు పడింది. ఇటీవల వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.


కలెక్టరేట్ కూడలిలో నిలిచిన విస్తరణ పనులు

- వేములవాడ పురపాలికలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కూడలి విస్తరణ, క్రీడా మైదానంలో ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు.
- పురపాలికలో దాదాపు పనులన్నీ నిలిచిపోవడంతో సిరిసిల్ల పురపాలక కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ నిధుల విడుదలకు ఉన్నతాధికారులను కోరుతూ రెండు నెలల క్రితం లేఖ రాశారు. దీనికి గతంలో నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు చేసుకునేలా మౌఖికంగా ఆదేశించారు. ప్రతిపాదించిన పనులకు నిధుల మంజూరు విషయమై ఎలాంటి సమాచారం రాలేదు. విలీన గ్రామాలు, శివారు కాలనీలో అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

చెత్త పాలవుతున్న వాహనాలు

న్యూస్‌టుడే, వేములవాడ

ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ పురపాలక సంఘం పరిధిలో రోజూ చెత్త సేకరించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో వాటి ప్రభావం చెత్త సేకరణపై పడుతుంది. మరోవైపు పట్టణంలో పారిశుద్ధ్య సమస్య నెలకొని జనం ఇబ్బందులు పడుతున్నారు.

పురపాలక సంఘంలోని మొత్తం 28 వార్డుల్లో చెత్త సేకరణకు 20 వాహనాలతో పాటు మరో ఆరు ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటికే మూడు వాహనాలు పూర్తిగా పనికి రాకుండా పోగా మరో మూడు మరమ్మతులకు గురి కావడంతో షెడ్డులో పెట్టారు. దీంతో పట్టణంలో రోజూ చెత్త సేకరణకు వాహనాల కొరత ఏర్పడింది.

- పట్టణంలోని రెండు చిన్న వార్డులకు ఒకటి, పెద్ద వార్డుకు ఒకటి చొప్పున వాహనాలను తిప్పుతున్నారు. వీటి ద్వారా రోజుకు భారీ ఎత్తున చెత్త సేకరణ చేపడుతున్నారు.
- వాహనాల కొరత కారణంగా కొన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు చెత్త సేకరణకు వస్తున్నట్లు పలు వార్డుల ప్రజలు చెబుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని వైనం


మున్సిపల్ కార్యాలయంలో మూలనపడిన వాహనాలు

- మున్సిపల్‌లోని చెత్త వాహనాలను దాదాపు అయిదేళ్ల క్రితం కొనుగోలు చేశారు. దీంతో అవి తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.
- చెత్త వాహనాలు నడిపేందుకు డ్రైవర్లు లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య సిబ్బందిలో డ్రైవింగ్ వచ్చిన కొందరు వాటిని నడుపుతున్నారు. డ్రైవర్లను నియమించి నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లాడ్జీలు, దుకాణదారుల ఇష్టారాజ్యం

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి దుకాణదారులు, లాడ్జీల ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇష్టారాజ్యంగా చెత్త, అట్టలు, కాగితాలను దుకాణాల ముందు, రోడ్లపై వేస్తున్నారు.

- కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువల్లో చెత్త, ఇతర వ్యర్థాలను వేస్తుండటంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగల బెడద పెరుగుతుంది. ఇటువంటి వారిపై మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో మళ్లీ యథేచ్ఛగా వేస్తున్నారు.

ప్రధాన రోడ్డులో రెండుసార్లు...

వేములవాడ ఆధ్యాత్మిక పట్టణం కావడంతో రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో రోడ్లపై చెత్త దర్శనమిస్తుంది.

- ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినప్పటికీ తిరిగి చెత్త దర్శనం ఇవ్వడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- రాజన్న ఆలయ పరిసరాలు, పట్టణంలోని ప్రధాన రహదారి, పోలీస్ స్టేషన్ నుంచి కోరుట్ల వైపు బస్టాండ్ వరకు రోజూ ఉదయం, రాత్రి వేళల్లో చెత్త సేకరిస్తున్నప్పటికీ మళ్లీ అక్కడక్కడ దర్శనమిస్తుంది.
- పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

మున్సిపల్‌లో చెత్త వాహనాలు, పారిశుద్ధ్య సిబ్బంది వివరాలు

మున్సిపల్‌లో వార్డుల సంఖ్య	28
పట్టణ జనాభా	56 వేలు
చెత్త వాహనాల సంఖ్య	20
ట్రాక్టర్లు	6
మరమ్మతులకు గురైనవి	3
పనికి రాకుండా ఉన్నవి	3
పట్టణంలో రోజూ సేకరించే చెత్త	20 టన్నులు
పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్య	140

పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు

చెత్త వాహనాలు మరమ్మతులకు గురైనప్పటికీ పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దుకాణాలు, లాడ్జీల వద్ద చెత్త వేసే వారికి జరిమానా విధిస్తున్నాం. పట్టణానికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బంది లేరు. ఉన్నవారితోనే పనులు చేయిస్తున్నాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో చెత్త వాహనాలతో సేకరిస్తున్నాం. చెత్త సమస్యపై ఎక్కడి నుంచి ఫిర్యాదులు రాలేదు.
- కిరణ్‌కుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, వేములవాడ

విద్యాలయాల్లో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

కోనరావుపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించి చాక్లెట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీటికి ఇబ్బంది ఉందని తెలపగా శుద్ధజల కేంద్రం ఏర్పాటు, బోరు బావి మోటార్, వంట గది నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు సమయానికి సరిపడా బస్సులు నడిపించాలని ఫోన్‌లో ఆర్టీసీ అధికారులకు సూచించారు. కళాశాల, ఆదర్శ పాఠశాల పరిసరాలలోని పిచ్చి మొక్కలు తొలగించాలని తెలిపారు. వార్షిక పరీక్షలో 10 గ్రేడు సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సన్మానం చేయిస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలని తెలిపారు. వీధి దీపాలు వెలిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సజావుగా సాగేలా నిర్వాహకులు నిబద్ధతతో పని చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా, వన్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, లోడింగ్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ట్యాబ్‌లో వివరాల నమోదులో జాప్యం చేయవద్దని సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచుకొని ధాన్యం తడవకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట డీఆర్డీవో శేషాద్రి, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


లాల్‌సింగ్‌తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

నా మాటే వినట్లేదు: కలెక్టర్

లాల్‌సింగ్‌తండాలో నెలకొన్న విద్యుత్తు సమస్యలను స్థానికులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ వీర్నపల్లి మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న రెండు విద్యుత్తు స్తంభాలను తొలగించాలని సెస్ ఛైర్మన్‌కు సూచించినా ఆ పని ఇప్పటి వరకు చేయలేదని, నా మాటే వినడం లేదు, ఇక మీ మాట వింటారా అనగా అక్కడున్నవారు ఒక్కసారిగా నవ్వారు. ఏది ఏమైనా సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఘనంగా చక్రతీర్థం

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నిత్యహోమం, మహా పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం మానేరు తీరంలో స్వామివారికి చక్రతీర్థం నిర్వహించారు. అనంతరం నివేదన, తీర్థప్రసాద వితరణ జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఈవో మారుతిరావు, కమిటీ సభ్యులు కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్త వీసీ ఎదుట సవాళ్లెన్నో!

శాతవాహన ఉపకులపతిగా ఉమేశ్‌కుమార్

ఈనాడు, కరీంనగర్

ఎట్టకేలకు శాతవాహన విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఉమేశ్‌కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనుండగా.. ఆయనకు పలు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి..





ఈ ఏడాది మే 21వ తేదీన అప్పటి ఉప కులపతిగా ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ పదవీ కాలం ముగియడంతో ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. వీసీ పోస్ట్ కోసం 158 మంది ఆచార్యులు దరఖాస్తు చేసుకోగా ఎట్టకేలకు ఇక్కడి విశ్వవిద్యాలయానికి పూర్తిస్థాయి వీసీగా ఉమేశ్‌కుమార్‌ను నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు వెలువరించింది. 2008లో విశ్వవిద్యాలయం ఏర్పాటైనప్పటినుంచి ఇప్పటి వరకు ముగ్గురే పూర్తిస్థాయి వీసీలుగా పనిచేశారు. మొదటి ఉప కులపతిగా మహ్మద్ ఇక్బాల్ అలీ, 2012లో కడారు వీరారెడ్డి, 2021లో ఎస్.మల్లేశ్ రెగ్యులర్ వీసీలుగా కొనసాగారు.

రిజిస్ట్రార్‌గా రెండేళ్లు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్ రసాయన శాస్త్ర ఆచార్యుడిగా పలు చోట్ల సేవలు అందించారు. 2018- 2020 మధ్య శాతవాహన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ పదవికి వన్నెతెచ్చే విధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకున్నారు. ఆయన హయాంలోనే స్నాతకోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో అదే మొదటి.. చివరి స్నాతకోత్సవం కావడం గమనార్హం. రహదారులు, వసతి గృహాల నిర్మాణాలు, అంబులెన్స్ ఏర్పాటు, ఏటీఎం సదుపాయాలు విద్యార్థులకు కల్పించారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా, ఇన్‌ఛార్జి వీసీగానూ ఈయన పనిచేశారు.

వీటిపై దృష్టి పెడితేనే..

గడిచిన కొన్నేళ్లుగా విశ్వవిద్యాలయంలో నిధుల దుర్వినియోగం, అవినీతిపై ఆరోపణలు విపరీతంగా వచ్చాయి. ఇటీవల ఇక్కడి వ్యవహారంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు కూడా చేపట్టారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ, అవినీతికి ఆస్కారం లేకుండా సంస్కరణలకు, మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టాలి. మరో వసతి గృహ భవనం నిర్మిస్తే ఇరుకిరుకుగా ఉండాల్సిన అవసరం తప్పుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకున్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చడం, కొత్త పోస్టులను మంజూరు చేయించడం, ఖాళీలు లేకుండా చూడటంలాంటి చర్యలతో ముందుకు సాగాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇవన్నీ పక్కాగా ఉంటేనే న్యాక్ గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే 12బీ హోదా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో నిధులను రాబట్టడంపై కొత్త వీసీ దృష్టి పెట్టాలి. మారుతున్న కాలంతోపాటు కొత్త కోర్సుల ఆవశ్యకతను గుర్తించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుని అందించాలి.

మండల వ్యవసాయాధికారులొచ్చారు

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

- జిల్లాలో ఏవో పోస్టులన్నీ భర్తీ

జిల్లాకు మండల వ్యవసాయాధికారులు వచ్చారు. ఖాళీగా ఉన్న మండల వ్యవసాయాధికారుల పోస్టులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ మేరకు ఆయా మండలాల్లో ఏవోలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో 13 మండలాలకు గాను కొన్ని మండలాల్లో వ్యవసాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉండగా, ఉన్నవారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొచ్చారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, బోయినపల్లి, చందుర్తి మండలాల్లో మాత్రమే ఏవోలు పూర్తిస్థాయి విధుల్లో కొనసాగుతున్నారు. దాంతోపాటు ఇటీవల నిర్వహించిన బదిలీల ప్రక్రియతో జిల్లాలో మొత్తం ఏడు మండలాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. మండల వ్యవసాయాధికారులు, ఏఈవోల కొరత, ఇన్‌ఛార్జిల బాధ్యతలు తదితర అంశాలపై 'సాగులో సలహాలు అందేదెలా?' అనే శీర్షికన ఈ నెల 6న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మండల వ్యవసాయాధికారుల ఉద్యోగాలను భర్తీ చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు కొత్తగా 8 మందిని కేటాయించడంతో కొరత తీరింది. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో సాంకేతిక ఏవోగా కె.రాజశేఖర్, కోనరావుపేటకు పి.సందీప్, రుద్రంగికి ఎం.ప్రియదర్శిని, వేములవాడ రూరల్‌కు వి.వినీత, గంభీరావుపేటకు ఎం.డి.సలావుద్దీన్, ముస్తాబాద్‌కు కె.అనూష, వీర్నపల్లికి కె.జయ, తంగళ్లపల్లి ఏవోగా కె.సంజీవ్‌ను నియమించింది. దీంతో వీరు విధుల్లో చేరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏవోలను స్థానిక నాయకులు, రైతులు సన్మానించారు.


వీర్నపల్లిలో బాధ్యతలు స్వీకరిస్తున్న మండల వ్యవసాయాధికారిణి జయ

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మాదకద్రవ్యాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశమందిరంలో నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు, నివారణ చర్యలు, మాదకద్రవ్యాల వాడకం, నియంత్రణ చర్యలు, నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రచారం వంటి పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 525 ప్రభుత్వ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లలకు డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ఆసుపత్రులు, మందుల దుకాణాలను ప్రతి నెలా తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి దీనికి సంబంధించిన 160 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 8712656426కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, జిల్లా ఆబ్కారీశాఖ అధికారి పంచాక్షరి, మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, డీఈవో రమేశ్‌కుమార్, ఇన్‌ఛార్జి డీఏవో రామారావు, డీఐఈవో శ్రీనివాస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవాని, అధికారులు పాల్గొన్నారు.

ఉన్నవి కూల్చి.. కొత్తవి నిర్మించక

గంభీరావుపేటలో సమస్యలతో సతమతం

న్యూస్‌టుడే, గంభీరావుపేట

రహదారి విస్తరణ పేరుతో మండల కేంద్రం గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో పలు నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. మరోవైపు రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ఉన్న సమస్యలకు కొత్తవి తోడయ్యాయి. ఫలితంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.

గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉన్న సమయంలో గాంధీచౌక్ వద్ద ఉన్న మార్కెట్ షెడ్‌ను, పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చివేశారు. సమీకృత మార్కెట్ నిర్మిస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కూరగాయలు అమ్మేవారు, కొనేవారు ఎండలో, వానలో ఇబ్బందులు పడుతున్నారు.


బస్టాండ్ వద్ద పడిన గుంతలు

- ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా మినీ బస్టాండ్, మూత్రశాలలు, దోశలగూడెం వద్ద బీఎస్ఎన్ఎల్ టవర్‌కు సంబంధించిన ప్రహరీ, దోశలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూల్చివేశారు. తిరిగి వాటిని నిర్మించలేదు. రహదారి విస్తరణ చేపట్టలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- పంచాయతీ కార్యాలయం వద్ద కాంప్లెక్స్, మూత్రశాలలు నిర్మించి ఏడాది దాటింది. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించి దాదాపు తొమ్మిది నెలలు అవుతున్నా వాటిని వినియోగంలోకి తీసుకురావటం లేదు. ఇటీవల కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు గదులను వేలం వేశారు. ఇందులో దక్కించుకున్న వారికి పంచాయతీ అధికారులు అప్పగించడం లేదు. అదేవిధంగా మేజర్ గ్రామ పంచాయతీకి, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు నిత్యం పనుల మీద చాలా మంది వస్తుంటారు. మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవి వినియోగంలోకి తీసుకురావడం లేదు.
- ప్రధాన రహదారిలో బస్టాండ్ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. చినుకులు పడితే చిత్తడిగా మారుతుంది. మరమ్మతులు చేపట్టడం లేదు.
- రెండు శుద్ధజల కేంద్రాలు ఉన్నా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.


ప్రహరీ లేని దోశలగూడెం ప్రాథమిక పాఠశాల

- చాలా చోట్ల పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. అయినా పట్టించుకోవడం లేదు.
- గత ప్రభుత్వం ప్రధాన రహదారి విస్తరణకు రూ.30 కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో రోడ్డు విస్తరణ కలగా మిగిలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధిలో వెనకబడింది



పంచాయతీ అధికారులు సమస్యలను పరిష్కరించాలి. మార్కెట్ షెడ్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నది కూల్చారు. చాలా చోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ కాలేదు. అభివృద్ధిలో గంభీరావుపేట వెనకబడిపోతుంది. **- జీడి హరీశ్, గంభీరావుపేట**

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మేజర్ గ్రామ పంచాయతీలోని సమస్యలను పంచాయతీకి వచ్చే నిధులతో అయ్యే వాటిని పరిష్కరిస్తున్నాం. అధిక నిధులు అవసరమున్న వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బస్టాండ్ వద్ద ఉన్న గుంతలను త్వరలోనే పూడ్చివేస్తాం. అపరిశుభ్రంగా ఉన్న చోట శుభ్రం చేస్తాం. పంచాయతీకి వచ్చే నిధులను బట్టి గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం. **- రాజేశ్వర్, ఎంపీవో**



వలస జీవుల ఆరోగ్యంతో వైద్య కేంద్రాల చెలగాటం

- ఏజెంట్లు, ల్యాబ్ నిర్వాహకుల దందా
- టీకాలు వికటించి ఆసుపత్రి పాలవుతున్న వైనం

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు సగటున 300 నుంచి 500 మంది ఇతర దేశాలకు వలస వెళ్తుంటారు. ఎలాంటి రుగ్మతలు లేకుంటేనే ఆయా దేశాలు వీసాలు మంజూరు చేస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు లేవని నిర్ధారించుకోవడంతోపాటు ఆయా దేశాలు సూచించిన టీకాలు తీసుకోవాలి. వీటిని ధ్రువీకరించాక వీసా మంజూరవుతుంది. హైదరాబాద్ నారాయణగూడలోని ప్రభుత్వ ఐపీఎం (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్), జీఏఎంసీపీ (గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ అప్రూవ్ మెడికల్ సెంటర్స్ అసోసియేషన్) కేంద్రాల్లో వైద్య పరీక్షలు, టీకాలు ఇస్తారు. ఐపీఎంలో రూ.30 చెల్లించి తమ వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. అందులో సూచించిన సమయానికి వెళ్తే ఉచితంగా టీకా ఇస్తారు. ఇక్కడ 26 రకాల టీకాలు అందుబాటులో ఉంటాయి. ఇక జీఏఎంసీపీలో ఒక్కరికి రూ.7,500 ఫీజు చెల్లించాలి.

✦ దుబాయ్, సౌదీ, ఒమన్, కువైట్, సింగపూర్, మలేషియా, ఆఫ్గానిస్థాన్ తదితర దేశాలకు వెళ్లేవారు వైద్య పరీక్షలు, టీకాలపై అవగాహన లేక పూర్తిగా ఏజెంట్లను నమ్ముతారు. వారు అడిగినంత ఇచ్చి మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా కనీసం వెయ్యి మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ లెక్కన నెలలో లక్షల రూపాయలు వైద్య పరీక్షల పేరిట వ్యాపారం జరుగుతోంది. వాస్తవంగా ఈ తరహా వైద్య పరీక్షలన్నీ ప్రభుత్వ ఐపీఎం కేంద్రంలో రూ.30 స్లాట్‌తో అయిపోతాయి. వీటిపై అవగాహన లేని వలస జీవులు వేలాది రూపాయలు నష్టపోతున్నారు.

ఉపాధి బాటలో గల్ఫ్ దేశాలకు వెళ్లే వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకుని వైద్య పరీక్షలు, టీకాల పేరిట కొందరు ఏజెంట్లు దండుకుంటున్నారు. ఎక్కువ కమీషన్‌కు ఆశ పడి అనుమతి లేని కేంద్రాల్లో పరీక్షలు చేయిస్తున్నారు. అక్కడ సరైన నిబంధనలు పాటించక టీకాలు వికటించి అనారోగ్యం బారిన పడుతున్నారు. లక్షలాది రూపాయలు ఏజెంట్లకు ముట్టజెప్పి, పొరుగు దేశాలకు వెళ్లిన వారు అక్కడ పని చేయలేని స్థితిలో ఇంటిబాట పడుతున్నారు. డబ్బులు పోయి, అనారోగ్యంతో ఉపాధి లేక వలస జీవులు అవస్థలు పడుతున్నారు.

✦ హైదరాబాద్‌లోని ఐపీఎంతోపాటు జీఏఎంసీపీ అనుమతి ఉన్నవి ఎనిమిది కేంద్రాలు ఉన్నాయి. అనుమతి లేని మెహదీపట్నం, హిమాయత్‌నగర్, చార్మినార్, పాతబస్తీ ప్రాంతాల్లో చాలా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో టీకాలు ఇచ్చేవారి చేతులు, సూది మందు ఇచ్చే ప్రాంతంలో చర్మాన్ని శుభ్రం చేయాలి. చర్మం పొరలోనే సూది మందు ఇవ్వాలి. కాని అపరిశుభ్రతతో చొక్కా పైనుంచి సూది ఇవ్వడం, అదీ చర్మం లోపలికి వేయడంతో కొన్ని రోజులకు సూది వేసిన చోట ఇన్‌ఫెక్షన్ ఏర్పడుతుంది. ఉమ్మడి జిల్లాలో జగిత్యాల, వేములవాడ, కరీంనగర్‌లలో ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్న వారు రోజు రోజుకు పెరుగుతున్నారు.



డబ్బులు ఖర్చయ్యాయి.. ఉపాధికి దూరమయ్యా..

- కారెంగుల రంజిత్‌కుమార్, సంగెం, కోరుట్ల మండలం

నేను కోరుట్లలో టైల్స్ నిర్మాణంలో పని చేస్తున్నాను. బహ్రెయిన్ వెళ్లేందుకు మెట్‌పల్లిలోని ఏజెంటుకు వీసా కోసం రూ.40 వేలు, వైద్య పరీక్షలకు రూ.7,200 చెల్లించాను. హైదరాబాద్ మెహదీపట్నంలోని ఎస్‌కే మెడికల్స్‌లో జూన్ 28న వెళ్లి వైద్య పరీక్షలు, టీకా చేయించుకున్నాను. పదిహేను రోజులకు టీకా వేసిన ప్రాంతంలో వాపుతోపాటు నొప్పి ఎక్కువైంది. స్థానిక వైద్యులను సంప్రదిస్తే, పరీక్షలు చేసి టీకా వికటించిందని శస్త్రచికిత్స చేశారు. పది రోజులకు తిరిగి నొప్పి రావడంతో రెండోసారి శస్త్రచికిత్స చేశారు. ఇప్పటికీ రూ.30 వేల పైనే ఖర్చయింది. వీసా వచ్చినా గడువు ముగియడంతో వెళ్లలేకపోయాను. టీకా ఇచ్చిన కేంద్రంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను.

కంపెనీకి డబ్బులు చెల్లించి ఇంటికి వచ్చా

- పోతుగంటి చంద్రశేఖర్, సంగెం, కోరుట్ల మండలం




ఆరు నెలల క్రితం ముంబయి ఏజెంటు సాయంతో క్లీనింగ్ సూపర్‌వైజర్ పని మీద సౌదీ వెళ్లాను. అక్కడికి వెళ్లిన రెండు నెలలకు టీకా తీసుకున్న ప్రాంతంలో నొప్పి రావడంతో అక్కడి వైద్యులను సంప్రదించాను. టీకా వికటించింది సర్జరీ చేయాలని సూచించారు. కంపెనీ వారు వేతనం ఇవ్వలేదు. నా దగ్గర చికిత్సకు డబ్బులు లేవు. కంపెనీకి అదనపు డబ్బులు చెల్లించి వచ్చాను. ఇప్పటికీ రెండు శస్త్రచికిత్సలు అయ్యాయి. మొత్తంగా రూ.4 లక్షలు ఖర్చయ్యాయి. ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీకా కేంద్రంపై చర్యలు తీసుకోవాలి.

పత్తి విక్రయాలకు సాంకేతిక దన్ను

న్యూస్‌టుడే, జమ్మికుంట

మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారాన్ని అందించేందుకు సాంకేతికను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంది. దీంతో సీసీఐ కేంద్రానికి వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలియనుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది? అక్కడ పత్తిని విక్రయించేందుకు ఎంత సమయం పడుతుందనే వివరాలను రైతులు ముందస్తుగా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు.



వాట్సాప్‌లో పత్తి రైతుకు కనిపించే వివరాలు

రైతులు ఏం చేయాలంటే..

✦ సీసీఐకి పత్తి విక్రయానికి సంబంధించిన సెల్ నంబర్ 8897 281111ను సేవ్ చేసుకోవాలి.

✦ ఆ నంబర్ వాట్సాప్‌లో 'హెచ్‌ఐ' అని టైపు చేయాలి.

✦ వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాప్ ఓపెన్ అవుతుంది.

✦ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలు కనిపిస్తాయి.

✦ కావాల్సిన భాషను ఎంపిక చేసుకోవాలి.

✦ భాషను ఎంపిక చేసుకోగానే పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం వంటి వివరాలు కనిపిస్తాయి.

✦ పత్తి విక్రయానికి సంబంధించి రైతు వివరాలు.. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. ఎన్ని క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగలదు వంటి వివరాలు తెలుస్తాయి.





పసిడి భానుడు.. వెన్నెల రేడు

నీలి మేఘాల మధ్య నుంచి భానుడి లేలేత కిరణాలతో పచ్చటి పంటలు పసిడి వర్ణాన్ని అద్దుకోగా చుట్టూ ఆకాశం ఎరుపు రంగులో తళుకులీనుతోంది. నీకు నేను పోటీ అంటూ పున్నమి చంద్రుడు ఎదురుగా వెన్నెల కాంతులు కురిపించాడు. శుక్రవారం తెల్లవారుజామున కమాన్‌పూర్ మండలం గుండారం పంచాయతీ రాజాపూర్ వద్ద పంట పొలాల్లో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్

చోటు కోసం పోటాపోటీ!

- పల్లెల్లో 'ఇందిరమ్మ కమిటీ'ల కలవరం

ఈనాడు, కరీంనగర్

స్థానిక సంస్థల ఎన్నికల విషయం పక్కకు వెళ్లి.. ప్రస్తుతం పల్లెల్లో ఇందిరమ్మ కమిటీల్లో చోటు కోసం చర్చ జరుగుతోంది. 'నాకంటే.. నాకు' అవకాశమివ్వాలన్న విజ్ఞప్తులు పెరుగుతుండటంతో అధికార పార్టీ నాయకులకూ తలనొప్పి వ్యవహారంగా మారింది. నాలుగు జిల్లాల పరిధిలో ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. అన్ని జిల్లాల కలెక్టర్ల చేతికి చేరిన ఈ ప్రతిపాదనలను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించిన తరువాత అధికారికంగా ప్రకటిస్తారు. కానీ చాలా గ్రామాల్లో ఇందులో చోటు దక్కించుకునేందుకు చోటామోటా నాయకులు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల ఏకాభిప్రాయాలతో సభ్యుల పేర్లు వెళ్లినప్పటికీ ఇంకొన్ని చోట్ల మాత్రం సీనియర్లు, జూనియర్లనే తారతమ్యంతో రెండు, మూడు జాబితాలు ఉన్నతాధికారులకు అందాయి.

ఆగమేఘాల మీద..

ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నాటికి ఎంపిక పూర్తి చేయాల్సి ఉండటంతో క్షేత్రస్థాయిలో కసరత్తు జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలనలోనూ ఉమ్మడి జిల్లాలో 7,18,756 మంది అర్జీలు అందించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 చొప్పున 12 నియోజకవర్గాలకు 42 వేలు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలిచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు.

ఏడుగురికి అవకాశం!

ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్‌గా గ్రామ సర్పంచి, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో ప్రస్తుతం ఛైర్మన్‌గా ప్రత్యేకాధికారి ఉంటారు. పుర, నగరపాలికల్లో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా ఉండనున్నారు. కన్వీనర్‌గా వార్డు అధికారికి చోటిస్తారు. వీరు కాకుండా కమిటీలో మరో అయిదుగురు స్థానికుల్ని తీసుకుంటారు. ఇందులో ఇద్దరు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిపై ఆసక్తి ఉన్న మరో ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. ఆ ముగ్గురిలో ఒకరు బీసీ మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ సామాజిక వర్గాల నుంచి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో చాలా గ్రామాల్లో ఈ పార్టీకి చెందిన వారే ఈ కమిటీల్లో చోటు కోసం పోటీపడ్డారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో కమిటీలది కీలకపాత్ర కావడం, తరువాత పథకంలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తూ లబ్ధిదారులకు అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించే అవకాశం కావడంతో చాలా మంది ఉత్సాహం చూపుతున్నారు.

వివాదం తప్పదా!

ఎంపికకు ముందే అటు కాంగ్రెస్ ఇటు భారాస నాయకుల మధ్య అక్కడక్కడా వివాదం మొదలైంది. హుజూరాబాద్‌లో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలోని చాలా గ్రామాల నుంచి ఈ కమిటీల్లో పలువురికి చోటివ్వాలని ప్రతిపాదనలు ఎంపీడీవోలకు అందించారు. భారాస ఎమ్మెల్యేలున్న కరీంనగర్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ఇదే తరహాలో ప్రతిపాదనలు పలు కమిటీల విషయంలో అందాయి. ముఖ్యంగా పురపాలిక, నగరపాలక సంస్థల్లో భారాస కార్పొరేటర్లు ఎక్కువగా ఉన్నారు. వారు పేర్లు ఇస్తుండగా అటు కాంగ్రెస్ వారు కూడా పోటీగా మరో ప్రతిపాదనను ఇస్తుండటంతో ఏది తుది జాబితాగా మార్చాలనే సందిగ్ధంలో అధికారులుంటున్నారు. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తరువాత అసలు కమిటీల్లో ఎవరుంటారనేది తేలనుంది.

23 నుంచి 26 వరకు డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లు

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (డీఈఈసెట్)-2024 ఉత్తీర్ణులై, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు డీ.ఎల్.ఎడ్./డీపీఎస్ఈ మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎల్ఎండీ కాలనీ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. ఇప్పటి వరకు ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోలేకపోయిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 21న తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీఈఈసెట్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెరిగిన పత్తి విక్రయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి విక్రయాలు పెరుగుతున్నాయి. యార్డుకు శుక్రవారం 174 ట్రాలీల కొత్త విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్ ఆరంభం నుంచి ఎక్కువ పత్తి విక్రయానికి రావటం ఇదే ప్రథమని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇతర మార్కెట్లలో పత్తి విక్రయాలు మొదలు కాలేదు. జమ్మికుంట మార్కెట్‌లో గత నెల 18 నుంచి కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం ట్రాలీల వారీగా బిడ్డింగ్ నిర్వహించారు. కొత్త విడిపత్తికి కనిష్ఠంగా రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ధర పలికింది. 38 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు వ్యాపారులు ఖరీదు చేశారు. గురువారం కంటే తాజాగా ధర రూ.50 తగ్గింది. స్థానిక ద్వితీయ శ్రేణి వ్యాపారులతోపాటు ఇద్దరు జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు పత్తిని ఖరీదు చేయగా.. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శులు ఆర్.మల్లేశం, రాజాలు పరిశీలించారు.

స్వయం ఉపాధికి చేయూత

ఎస్‌బీఐ ఆర్‌సెటిలో కంప్యూటర్ ట్యాలీపై ఉచిత శిక్షణ

న్యూస్‌టుడే, తిమ్మాపూర్

గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులకు ఎస్‌బీఐ ఆర్‌సెటి అండగా నిలుస్తోంది. అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు వ్యాపార సాధన నైపుణ్యాలను పెంపొందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ ఉచిత శిక్షణ ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

30 రోజులపాటు..

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో 2010 సంవత్సరంలో నెలకొల్పిన ఎస్‌బీఐ ఆర్‌సెటి (గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ)లో ఈ నెల 23 నుంచి కంప్యూటర్ ట్యాలీ కోర్సుపై 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుంది.
- ఆసక్తి గల ఉమ్మడి జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల (18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన) పురుషులు ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఈ నెల 22వ తేదీ లోపు సంస్థలో సంప్రదించాలి.
- కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 30 రోజుల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.
- శిక్షణ కాలంలో ఉచిత భోజనంతోపాటు ఉచిత వసతిని అందిస్తారు.



మహాత్మానగర్‌లోని ఎస్‌బీఐ ఆర్‌సెటి సంస్థ

యువత సద్వినియోగం చేసుకోవాలి

- డి.సంపత్, సంస్థ, డైరెక్టర్

సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపర్చేలా కృషి చేస్తున్నాం. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ అనంతరం ధ్రువపత్రాన్ని అందజేయడంతోపాటు వ్యాపార రంగానికి సంబంధించిన రుణాన్ని బ్యాంకు ద్వారా అందజేస్తున్నాం.

వరద కాలువకు నీటి విడుదల


హెడ్‌రెగ్యులేటర్ నుంచి వరదకాలువకు విడుదలవుతున్న నీరు

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయం నుంచి వరదకాలువకు శుక్రవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఈ నీటిని మధ్యమానేరు జలాశయానికి తరలించనున్నారు. ప్రాజెక్టులోకి 23,826 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా స్పిల్‌వే గేట్లద్వారా 6,248 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 5,800, ఇతర కాలువలు, మిషన్ భగీరథ, ఎత్తిపోతలు కలుపుకుని మొత్తం ఇన్‌ఫ్లోకు సమానంగా ఔట్‌ఫ్లోను కొనసాగిస్తూ ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటిని నిల్వచేస్తున్నారు.

తేలికపాటి వర్షసూచన.. ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు పొలాస పరిశోధనస్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. వర్షసూచన ఉన్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని వివరించారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకంపై హర్షం

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా డాక్టర్ దండ రాజిరెడ్డిలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన దండ రాజిరెడ్డి గతంలో జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానంలో శాస్త్రవేత్తగా పనిచేయగా అల్దాస్ జానయ్య జగిత్యాల పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పనిచేశారు. ఉమ్మడి జిల్లాతో అనుబంధంగల ఇద్దరు వ్యక్తులు రెండు వర్సిటీలకు వీసీలుగా నియమితులు కావటంపై సాగురంగానికి మేలు కలిగిస్తుందని ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతిభట్, డాక్టర్ మంజులత, డాక్టర్ శ్రీధర్‌సిద్ధి, వెల్మల రాంరెడ్డి, వంగల వెంకటరెడ్డి పేర్కొన్నారు.

చిన్నారులకూ ఏకరూప దుస్తులు

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీకి సిద్ధం

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్

పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే ఏకరూప దుస్తులను ఇక నుంచి అంగన్‌వాడీ పిల్లలకూ అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిట్టి, పొట్టి చిన్నారులు ఇక నుంచి ఏకరూప దుస్తుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో సందడి చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తరహాలో అంగన్‌వాడీ చిన్నారులు కనిపించనున్నారు. ప్రభుత్వం వస్త్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రాలకు అందజేసింది. ఈ వస్త్రంతో మహిళా సంఘ సభ్యులు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తి చేశారు. కొన్ని రోజుల్లో చిన్నారులకు అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
జగిత్యాల	1065	63,835
కరీంనగర్	777	43,736
సిరిసిల్ల	587	34,376
పెద్దపల్లి	706	35,112

మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు..

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించటంతోపాటు ఆటపాటలతో ప్రాథమిక విద్య నేర్పించటానికే మూడు దశాబ్దాల క్రితం అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు చిన్నారులు వివిధ రకాల దుస్తులు ధరించి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇక నుంచి వారు ఏకరూప దుస్తులు ధరించి అంగన్‌వాడీలకు రావాల్సి ఉంటుంది. బాలురకు చొక్కా, నెక్కరు, బాలికలకు గౌను ఆకర్షణీయంగా డిజైన్ చేయటంతో అదే తరహాల్లో దర్జీలు కుడుతున్నారు. ఒక్కో జత కుట్టేందుకు రూ.80 నుంచి రూ.100 వరకు ప్రభుత్వం వారికి చెల్లిస్తుంది. దర్జీ పనులు ఇప్పటి వరకు 99 శాతం పూర్తయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పంపిణీ చేయనున్నారు.


చిన్నారుల దుస్తుల నమూనా

మంచి డిజైన్లతో కుట్టాం

మాకు అప్పగించిన వస్త్రాలను చిన్నారుల కొలతలకు తగినట్లుగా, వివిధ రకాల డిజైన్లతో షర్టులు, నెక్కర్లు, గౌన్లు కుట్టాం. నాణ్యత ప్రమాణాలు పాటించాం. మాకు అప్పగించిన వస్త్రాన్ని మొత్తం కుట్టడం పూర్తి చేసి సంబంధిత శాఖకు అప్పగించాం.

- దీప్తి, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు, కరీంనగర్

త్వరలోనే పంపిణీ

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టడం పూర్తయింది. త్వరలోనే కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా వాటిని పంపిణీ చేయనున్నాం. దుస్తుల పంపిణీతో కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య సైతం పెరుగుతుందని ఆశిస్తున్నాం. మొదట 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయసుగల చిన్నారులకు పంపిణీ చేయనున్నాం.

- సరస్వతి, జిల్లా సంక్షేమాధికారి, కరీంనగర్

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, బోయినపల్లి

? బోయినపల్లిలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి వెళ్లే దారిలో మురుగు కాలువపై వేసిన బిల్ల విరిగి ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. - అనిల్, బోయినపల్లి

✔ మురుగు కాలువపై ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించాం. ప్రమాదాలు నివారణకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.- జయశీల, ఎంపీడీవో

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

? ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీలో విద్యుత్ సెంటర్ల నుంచి వ్యర్థాలను పగటిపూట తీసుకెళ్లడం ద్వారా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో కాకుండా రాత్రిపూట వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకోవాలి. - శివరామకృష్ణ, ఎల్లారెడ్డిపేట

✔ చికెన్ సెంటర్ల నిర్వాహకులకు తొలుత నోటీసులు జారీ చేస్తాం. రాత్రి సమయంలో వ్యర్థాలను వాహనంలో తరలించేలా చర్యలు తీసుకుంటాం. - ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి




సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో సిరిసిల్లలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎ.దుర్గా ప్రసన్న, కె.వైష్ణవి, ఎం.డి.ముజామిల్ పాషాలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజురెడ్డి, సమన్వయకర్త జనపాల శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సిరిసిల్ల (విద్యానగర్)

భగీరథ పైపుల లీకేజీ



వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. కొంత కాలంగా భగీరథ పైపులైను లీకేజీతో నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున పారుతోందని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పైపులకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, వేములవాడ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని సుభాష్‌నగర్ కార్మికభవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికులకు సంబంధించి లేబర్ కార్డులు ఆన్‌లైన్‌లో గత 2 నెలలుగా ఓపెన్ కావడం లేదని, దీంతో కార్మికులకు బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్మికులకు నూతన లేబర్ కార్డులు అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దంటూ ప్రచారం

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టవద్దని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వివిధ గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కుప్పలుగా పోయడంతోపాటు ఆరబెడితే వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా రోడ్డు ప్రమాదాలు పొంచిఉంటాయని అందుకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీ మైదానంలో డిగ్రీ కళాశాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోఆర్డినేటర్ పాశర్ల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి చేతుల మీదుగా పోటీలను ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణంలో జాప్యం

వినియోగదారులకు ఇబ్బందులు

న్యూస్‌టుడే, బోయినపల్లి

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సరఫరా అందించేందుకు సెస్ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఉప కేంద్రాలపై భారం పడకుండా ఉండేందుకు నూతన విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మాన్వాడ గ్రామానికి ఉప కేంద్రం మంజూరు చేశారు. ఇది జరిగి నాలుగేళ్లు గడిచినప్పటికీ నిర్మాణంలో జాప్యం వల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మండలంలోని ఐరవై మూడు గ్రామాల పరిధిలో బోయినపల్లి, మల్కాపూర్, కోరెం, స్తంభంపల్లి, విలాసాగర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి వ్యవసాయ, గృహ, ఇతర అవసరాలకు విద్యుత్తు సరఫరా జరుగుతుంది. వెంకట్రావుపల్లి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో వెంకట్రావుపల్లి, నీలోజిపల్లి, కొదురుపాక, వరదవెల్లి, జగ్గారావుపల్లి, నర్సింగాపూర్, కొత్తపేట, మాన్వాడ, మల్లాపూర్ గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ఉప కేంద్రంపై అధిక భారంతో లోవోల్టేజీ, నియంత్రికల వద్ద ఫ్యూజులు పోవడం, ఇతర సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో మాన్వాడలో నూతన విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు నాలుగేళ్ల క్రితం రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి.


వెంకట్రావుపల్లిలోని విద్యుత్తు ఉప కేంద్రం

ఎన్‌వోసీ కోసం ఎదురుచూపులు

మాన్వాడకు ఉప కేంద్రం మంజూరైనప్పటికీ స్థల లభ్యత లేకపోవడంతో నిర్మాణంలో జాప్యం నెలకొంది. ఉప కేంద్రం నిర్మించడానికి ఎకరం స్థలం అవసరం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ అధికారులు సెస్ అధికారులకు తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ స్థలాలపై దృష్టి సారించారు. రాజరాజేశ్వర జలాశయం కట్ట కింద మిగులు స్థలాలు ఉన్నాయి. జలాశయం మిగులు స్థలం ఉప కేంద్రానికి కేటాయించాలని కోరుతూ సెస్ నుంచి జలవనరులశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటి వరకు ఎన్‌వోసీ రాకపోవడంతో ఉప కేంద్రం నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఫలితంగా తొమ్మిది గ్రామాల విద్యుత్తు వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సరఫరాలో అంతరాయం

- సాయి, మాన్వాడ



గ్రామంలో విద్యుత్తు ఉప కేంద్రం త్వరగా ఏర్పాటు చేయాలి. జలాశయ నిర్మాణంలో మా గ్రామానికి చెందిన రైతులు విలువైన భూములు కోల్పోయారు. ఉప కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి. తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఉప కేంద్రం ఏర్పాటుతో సమస్య తీరుతుంది.

త్వరలోనే పనులు ప్రారంభం

- కొట్టెపల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్



విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ జలవనరులశాఖ అధికారులను కలిశాం. త్వరలో ఎన్‌వోసీ వస్తుంది. వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. మండలంలోని వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నాం. ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


దేవయ్య

గంభీరావుపేట, న్యూస్‌టుడే: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వ్యక్తికి ఫిట్స్ వచ్చి మృతి చెందగా స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కరువారి దేవయ్య మృత్యుకారుడు. అతనికి భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని ఉపాధి కోసం ఆగస్టు 19న దుబాయ్ వెళ్లాడు. వెళ్లిన రెండు రోజులకు పనిలో చేరాడు. పనిలోకి వెళ్లిన మరుసటి రోజు ఫిట్స్ రావటంతో కంపెనీ వారు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ దేవయ్య ఆగస్టు 27న మృతి చెందాడు. శుక్రవారం మృతదేహం గంభీరావుపేటకు చేరుకుంది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రభుత్వం కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మాజీ సర్పంచికి భాజపా నేత పరామర్శ

నాగారం (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి మ్యాకల భూమయ్య ఇటీవల ఇంట్లో కాలు జారి పడి గాయపడ్డాడు. భాజపా నాయకులు చెన్నమనేని వికాస్‌రావు-దీప దంపతులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం భాజపా నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి తీగల రవీందర్, నాయకులు బాలాజీ, తిరుపతి, ప్రదీప్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు.

ముస్తాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను సూచించారు. ముస్తాబాద్ మండలం నామాపూర్, చీకోడ్, చిప్పలపల్లి గ్రామాల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. అలాగే మోహినికుంట, వెంకట్రావుపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణి ప్రారంభించారు.

కొత్తపల్లి (గంభీరావుపేట): ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్, మల్లారెడ్డిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు కొమిరిశెట్టి విజయ శుక్రవారం


కొత్తపల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ప్రారంభించారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు అగ్రహారం, హరిదాస్‌నగర్, బండలింగంపల్లి, కిష్టునాయక్‌తండా, రాచర్ల బొప్పాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్మన్ సాబేరాబేగం, పీఏసీఎస్ ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు.


ఇల్లంతకుంటలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


లక్ష్మణ్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గంభీరావుపేటకు చెందిన బాలన్నగారి లక్ష్మణ్‌గౌడ్ (35) గురువారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంభీరావుపేటలోని కేసీఆర్ నగర్ కాలనీకి చెందిన లక్ష్మణ్‌గౌడ్ గత కొంత కాలంగా మండల కేంద్రంలోని ఓ వైన్స్ పర్మిట్ గదిలో వంట మనిషిగా పని చేస్తున్నాడు. రోజూ ఉదయం గంభీరావుపేట నుంచి ఎల్లారెడ్డిపేట చేరుకొని, తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తాడు. ఎప్పటిలాగే గంభీరావుపేట వెళ్లేందుకు బస్టాండుకు చేరుకున్నాడు. అక్కడే ఓ పాన్‌షాప్ పక్కన పడిపోయాడు. గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందగానే సంఘటన స్థలానికి చేరుకొని లక్ష్మణ్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిని గమనించారు. అప్పటికే అతను చనిపోయినట్లు గుర్తించారు. మృతుడికి భార్య మేఘమాల, కుమార్తె హారిక ఉన్నారు. తన భర్త చనిపోవడానికి గల కారణాలపై విచారణ చేయాలంటూ మేఘమాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ శుక్రవారం పేర్కొన్నారు.

వృద్ధురాలి బలవన్మరణం

బోయినపల్లి, న్యూస్‌టుడే: కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిలోని కొదురుపాక నాలుగు వరుసల రహదారి వంతెన వద్ద మధ్యమానేరు జలాశయంలో దూకి వృద్ధురాలు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది.

నేర వార్తలు

పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొదురుపాక గ్రామానికి చెందిన కనకవ్వ (60) కాళ్లు, చేతులు నొప్పులు ఉన్నాయని వేములవాడ ఆసుపత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. జలాశయంలో మహిళ మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వేములవాడ ఏసీపీ శేషాద్రినిరెడ్డి, గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్ గౌడ్ చేరుకొని మత్స్యకారులతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. కనకవ్వ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్సై చెప్పారు. కనకవ్వకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గొలుసు దుకాణానికి వేలం.. నలుగురిపై కేసు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలో గొలుసు దుకాణం నిర్వహణకు వేలం వేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం రాళ్లపేట మాజీ సర్పంచి బాలసాని పర్శరాములు, బొద్దుల పర్శరాములు, గొర అంజయ్య, సోమ ఎల్లయ్యలు గ్రామంలో మద్యం అమ్మడానికి గొలుసు దుకాణం నిర్వహణకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన గజాది శ్రీకాంత్ రూ.66,500కు పాడుకున్నాడు. పెద్ద మనుషులు అతని వద్ద రూ.33 వేలు తీసుకొని మిగతావి తర్వాత ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో శ్రీకాంత్ తప్ప మిగిలిన వారు గొలుసు దుకాణాలు నిర్వహించకూడదని సూచించారు. నిర్వహించిన వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తామని హుకుం జారీ చేశారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా గొలుసు దుకాణం వేలం నిర్వహించిన నలుగురిపై కేసు నమోదు చేసి బాలసాని పర్శరాములు, బొద్దుల పర్శరాములు, గొర అంజయ్యలను రిమాండ్‌కు తరలించగా, సోమ ఎల్లయ్య పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. గ్రామాల అభివృద్ధి పేరిట చట్టవ్యతిరేకంగా వేలం నిర్వహిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

గ్రానైట్ లారీ ఆపి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై...

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : తంగళ్లపల్లి మండలం సారంపల్లి శివారులో మూడు రోజుల క్రితం గ్రానైట్ లారీని ఆపి రూ.10 వేలు వసూలు చేసిన కంసాల అంజనేయులు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఇల్లంతకుంట మండలం తెనుగువారిపల్లి గ్రామానికి చెందిన అజు నాయక్ అనే వ్యక్తి తంగళ్లపల్లి మండలం సారంపల్లి నుంచి గ్రానైట్ లారీని ఆపి ఇలా తకుంట మండలంలో పాలకు యార్డ్‌కి వెళ్తుండగా సున్నెకల్ అని డ్రైవరును బెదిరించి డబ్బులు వసూలు చేశాడని, బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

భాజపా పటిష్ఠానికి కృషి చేయాలి

బోయినపల్లి, న్యూస్‌టుడే: భాజపా పటిష్ఠానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్ రెడ్డి సూచించారు. నర్సింగాపూర్‌లో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించగా బాల్‌రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు భాజపా సభ్యత్వం అందే విధంగా చూడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని నాయకులు, కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు రెడ్డవేణి రాజు, చొప్పదండి నియోజకవర్గ కోకన్వీనర్ ఉదారి నరసింహాచారి, సాయికుమార్ పాల్గొన్నారు.

రాజన్న కోడె మృత్యువాత

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన రైతు ఒక స్వామివారి కోడెను అందజేసిన రాజన్న కోడె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ నెల 1న వేములవాడ గోశాలలో రాజన్న కోడెలను అధికారులు పంపిణీ చేశారని రైతు తెలిపారు. పక్షం రోజుల కిందట అనారోగ్యం బారిన పడగా చికిత్స చేయించినా ఆరోగ్యం మెరుగుపడలేదని పేర్కొన్నారు.

ప్రయాణికులకు బహుమతుల అందజేత

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో లక్కీడ్రాలో విజేతలుగా ఎంపికైన ప్రయాణికులకు శుక్రవారం డీఎం శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. వేములవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన వారి నుంచి లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. అఫ్రోజ ప్రథమ, వెన్నెల ద్వితీయ, సుజాత తృతీయ బహుమతులను గెలుపొందారు. వీరికి ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో బహుమతులను డీఎం అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ కృష్ణ, పీఆర్‌వో శ్రీనివాస్‌యాదవ్, బస్ పాస్‌ల జారీ ఇన్‌చార్జి శ్రీనివాస్, ప్రయాణికులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని రామక్కపేటగ్రావు పల్లెకు వెళ్లే దారిలో వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.62 లక్షలు మంజూరు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మనోహర్, డీసీసీ కార్యదర్శి తిరుపతి, నాయకులు గంగనర్సయ్య, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


చందుర్తిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చందుర్తి: రహదారి, స్లాబ్, కల్వర్టుల నిర్మాణాలకు చందుర్తి మండలంలోని సనుగుల కు రూ.కోటి, మూడపల్లి గ్రామానికి రూ.80 లక్షలు మంజూరు కాగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లాపరిషత్ మాజీ సభ్యుడు నాగం కుమార్, సిరికొండ మాజీ సర్పంచి ఇ.శ్యామ్‌కుమార్, మల్యాల రవీందర్ పాల్గొన్నారు.


టీఎంసీ రాజమణి సేవలు మరువలేనివి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్ రాజమణి సేవలు మరువలేనివని సిరిసిల్ల పురపాలక సంఘం ఛైర్పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పురపాలక సంఘం కార్యాలయంలో రాజమణి చిత్రపటానికి ఛైర్పర్సన్ జిందం కళ నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా రాజమణి సిరిసిల్ల పురపాలక సంఘానికి విశేష సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మం, దైవం రెండు కళ్లలాంటివి

శ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్‌స్వామి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ధర్మం, దైవం రెండు కళ్లలాంటివని, వాటిని కాపాడుకుంటేనే ప్రజలు, సమాజం బాగుంటుందని శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి శిష్యుడు, శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్‌స్వామి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంతోపాటు సత్సంగ సదనంలోని రామకోటి, నారాయణపూర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్‌స్వామి మాట్లాడుతూ ధర్మం, దైవం రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. పార్టీలు రాజకీయాలకు అతీతంగా పనిచేసి, ధర్మాన్ని కాపాడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్పర్సన్ సాబేరాబేగం, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య,



జీయర్‌స్వామితో విప్ ఆది శ్రీనివాస్ తదితరులు

పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రమణీయం... రథోత్సవం

లింగన్నపేట (గంభీరావుపేట): గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని పాతహర దేవాలయంలో శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు రథంపై దర్శనం ఇచ్చారు. ఉదయం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని రథం లాగారు. కేడీసీసీబీ అధ్యక్షుడు రవీందర్‌రావు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సన్మానించింది. పూజలు చేసిన జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కాంగ్రెస్, భారాస నాయకులు పాల్గొన్నారు.

పత్తిపాకకు 'మాచిరాజు బాలసాహిత్య పురస్కారం'



సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్ 2024 సంవత్సరానికి గాను మాచిరాజు బాలసాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. సాహితీవేత్త మాచిరాజు కామేశ్వరరావు నెలకొల్పిన మాచిరాజు బాలసాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. బాలసాహిత్యంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను ఈ పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నవంబర్ 9న ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు పత్తిపాక మోహన్‌ను అభినందించారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ ఉపశమన సంరక్షణ చికిత్స దినోత్సవాన్ని వైద్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి వసంతరావు ముఖ్య అతిథిగా హాజరై కేకు కోసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, వైద్యులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఆసుపత్రిలో కేకు కోస్తున్న జిల్లా వైద్యాధికారి వసంతరావు

రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: డ్రాలో ఎంపికైన వారికి కేటాయించిన రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోయారు. డ్రాలో ఎంపికైన వారికి రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సిరిసిల్ల పట్టణంలోని పలు వార్డులకు చెందిన లబ్ధిదారులు కలెక్టరేట్ వినతిపత్రం అందజేయడానికి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన పేదలు

కలెక్టరేట్‌కు రాగా పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రాలో ఎంపికైన వారిలో 105 మంది మిగిలిపోయారని, వెంటనే ఇళ్లను అప్పగించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రేణుక, కవిత, లత, రూప, స్వప్న, మమత, అనియా, లక్ష్మి, నవ్య, సువర్ణ, పద్మ, అక్షయ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని దీక్ష

సిరిసిల్ల (గ్రామీణం), న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం తాజా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు నిరాహార దీక్షలు చేపట్టారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షులు కరుణాకర్ మాట్లాడుతూ సర్పంచులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బిల్లులు చెల్లించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర నాయకులు మల్లు మాట, నాయకులు అంజయ్య, గణప శివజ్యోతి, కోల నర్సయ్య, కేశవరావు, సుమతి, ఎల్లం, నర్సింహారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల దీక్షలో మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు

ప్రైవేటు పాఠశాలపై డీఈవోకు ఫిర్యాదు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థి చెంపై కొట్టడంతో వైద్యం పొందితే చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. పాఠశాల సెల్లార్‌లో కొనసాగించడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ రాజారావు, ప్రశాంత్, శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకే ఇళ్లు కేటాయించాలి

సిరిసిల్ల (గ్రామీణం), న్యూస్‌టుడే : దళితుల కోసం కట్టిన రెండు పడక గదుల ఇళ్లను వారికే కేటాయించాలని అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక కొన్నిజిల్లా వారికి అనుకూలంగా ఉన్నవారికి ఇవ్వడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆకునూరి బాలరాజు, అంబేడ్కర్‌నగర్‌వాసులు నేదురి లక్ష్మణ్, నక్క నర్సయ్య, గడ్డం కిరణ్, అకునూరి బాలకిషన్, హనుమంతు, బొద్దు నారాయణ, మహిళలు పాల్గొన్నారు.